www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 15 సెప్టెంబర్ 2023

21న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - రాయచోటి

రాజంపేటలో ఈ నెల 21న జిల్లా స్థాయి యువజనోత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయి గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు జిల్లా వారిచే ప్రతి సంవత్సరమూ నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఉదయం 9గంటలకు రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 15 నుంచి 29 ఏళ్ల వయస్సు నిండని అన్నమయ్య జిల్లా స్థానికత గల యువతకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సదరు యువజనోత్సవాలలో ఈ దిగువ పేర్కొన్న అంశాల్లో పోటీలుంటాయన్నారు. జానపద నృతం, జానపద గేయం, ఫొటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్, స్టోరీ రైటింగ్ వంటి అంశాలలో పాల్గొనదలచిన ఆసక్తిగల యువత http://tinyurl.com/dyfanmy-2023 లింకులో వారికి ప్రావీణ్యం గల అంశాల వారిగా నేరుగా, వేర్వేరుగా ఈనెల 18లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివిధ అంశాలల్లో ప్రథమ బహుమతిలో విజేతలైన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949298810, 8074305134లలో సంప్రదించాలన్నారు.

ఎట్టకేలకు ఐఎబి

ఖరీఫ్ ముగింపు దశలో సమావేశం
2.15 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం
ఆయకట్టుదారుల్లో అయోమయం
నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

వెలిగల్లు ప్రాజెక్టు

జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఎట్టకేలకు ఖరారైంది. శుక్రవారం ఆయా కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్లలో సమావేశాలను నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాల్ని అందజేశారు. 2023-24 ఖరీఫ్ సీజన్ ముగింపు దశలో సాగునీటి సలహా మండలి సమావేశాలు నిర్వహించడంపై చర్చనీయాంశంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం, వర్షాభావ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో మధ్యలో గానీ ఆయా ప్రాజెక్టుల ఆయకట్టు సాగు ఎంత, ప్రాజెక్టుల్లో నీటి నిల్వల పరిమాణం ఎంత, ఎంత నీటిని, ఎప్పుడు విడుదల చేయాలనే అంశాలపై చర్చించడం సమంజసంగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ముగింపు దశలో సమావేశాలు నిర్వహించడంలోని ఉద్దేశమేమిటో తెలియడం లేదు. సమావేశాలు నిర్వహిస్తే ప్రజాప్రయోజనం లభించే అవకాశం ఉంది. సీజన్ ముగింపు దశలో కెసి కెనాల్, బ్రహ్మసాగర్, మైలవరం, వెలిగల్లు రిజర్వాయర్ల పరిధిలోని సుమారు 2.15 లక్షల నుంచి 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిన సమయంలో సమావేశాలు నిర్వహించడంలో అర్థ మేమిటో తెలియడం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 15 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. కెసి కెనాల్, బ్రహ్మసాగర్, మైలవరం, చిత్రావతి, పిబిసి వెలిగల్లు రిజర్వాయర్లు ఆయకట్టు ప్రాణాధారితాలు. చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లు మినహా మిగిలిన ప్రాజెక్టుల ఆయ కట్టుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెసి కెనాల్, బ్రహ్మసాగర్, మైలవరం, వెలిగల్లు రిజర్వాయర్ల ఆయకట్టు దారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా ప్రాజెక్టుల కింద సుమారు రెండు లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు బీళ్లుగా దర్శన మిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఆయకట్టు రైతుల్లో అయోమయం

శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల నుంచి సాగునీరు విడుదలకు నోచని నేపథ్యంలో జిల్లాలోని ఆయకట్టుదారుల్లో అయోమయం నెలకొంది. ప్రభుత్వం ప్రతిఏటా ఆగష్టు మూడో వారంలో 16, 17 తేదీల్లో కెసి కెనాల్ ఆయకట్టు, బ్రహ్మసాగర్ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయడం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ మూడోవారం గడుస్తున్నప్పటికీ శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల్లో నీటి నిల్వల పరిమాణం పెరగలేదనే కారణంతో సాగునీటిని విడుదల చేయకపోవడం గమనార్హం. ఫలితంగా కెసి కెనాల్ కింద 92 వేల ఎకరాలు, బ్రహ్మసాగర్ కింద 1.05 ఎకరాల్లో 70 వేల ఎకరాలు, మైలవరం కింద 24 వేల ఎకరాలు వెరసి 2.15 లక్షల నుంచి 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా దర్శనమిస్తోంది.

కాల్వలకు మరమ్మతులేవీ?

జిల్లాకు కెసి కెనాల్ ఆయకట్టు ప్రాణాధారితం. ప్రతిఏటా చివరి ఆయకట్టుకు నీరందించాలంటే తలకు మించిన భారం గా మారుతోంది. కాల్వల అక్కడక్కడా మరమ్మతులకు గురవడం, లస్కర్ల కొరత తీవ్రంగా వేధిస్తుండడం, ఏపుగా పెరిగిన జమ్ము, ఇతర వ్యర్థాల కారణంగా సాగుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. మైల వరం కుడి, ఎడమ కాల్వలు తరుచుగా మరమ్మతులకు గురవ డం, ఓ కాల్వలో అడవిని తలపించే కంప చెట్లతో కలిసి జమ్ము ఏపుగా పెరగడం పరిపాటిగా మారింది. అన్నమయ్య జిల్లా లోని వెలిగల్లు రిజర్వాయర్ ప్రధానకాల్వలు, డిస్ట్రిబ్యూటరీల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటుడడం తెలిసిందే. డిస్ట్రి బ్యూటరీలు, ఫీడర్ ఛానళ్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయని కారణంగా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడం సాధ్యం కావడం లేదు. అన్నమయ్య, పింఛా, జలాశయాలు గల్లంతైన నేపథ్యం వంటి సమస్యలతో వ్యవసాయ, నీటి పారుదల శాఖలు కునారిల్లుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : కలెక్టర్

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టర్, జెసి, డిఆర్ఒ బంగ్లా కోసం స్థల చదును, భూమి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వెనక వైపు కలెక్టర్, జెసి, డిఆర్ఒ బంగ్లాల నిర్మాణం నిమిత్తం చదును చేస్తున్న పనులను రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జెసి, డిఆర్ఒ బంగ్లాలను ఏ ప్రదేశంలో ఎంత విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టారు, మెయిన్ రోడ్డుకు, కలెక్టరేట్‌కు అనుసంధానిస్తూ రహదారి ఏర్పాటు తదితరాలను మ్యాపుల ద్వారా కలెక్టరు పరిశీలించారు. అక్కడ ప్రకృతి పరంగా ఏర్పడిన గుండ్లను భవనాల నిర్మాణాలకు తొలగించరాదని చెప్పారు. గుంతలు ఏర్పడిన ప్రాంతాన్ని మట్టితో నింపి చదునుచేయాలని పేర్కొన్నారు. అలాగే ఆ ప్రదేశంలో ఉన్న పెద్ద చెట్లను నరికి వేయకుండా పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఆ ప్రాంతంలో ఇతరులు ఎవరూ మట్టి తవ్వి తీసుకొని వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తే వారిపై కేసులు నమోదు చేయాలని సదరు బంగ్లా నిర్మాణాలు చేపట్టిన ప్రభుత్వ స్థలం చుట్టూ వెంటనే ఫెన్సింగ్ వేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఆర్కిటెక్చర్‌ను పిలిపించి సదరు స్థలాన్ని స్వయంగా పరిశీలించి బంగ్లాల నిర్మాణం మ్యాపులు రూపొందించాలని ఆర్ అండ్‌బి అధికారులను ఆదేశించారు. భూమి అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి తహశీల్దార్ ప్రేమంత కుమార్, ఉమ్మడి జిల్లా ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్‌రెడ్డి, డిఇ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇవిఎంల స్కానింగ్ ప్రక్రియను పూర్తిచేయాలి

జిల్లాకు ఇటీవల నూతనంగా వచ్చి స్థానిక గోడౌన్లలో భద్రపరిచిన ఇవిఎంలన్నింటిని శుక్రవారం సాయంత్రంలోగా స్కానింగ్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న ఇవిఎంల గోడౌన్‌లో ఇవిఎంల స్కానింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ నుంచి జిల్లాకు ఎన్ని ఇవిఎంలు వచ్చాయి, ఎన్నింటిని స్కాన్ చేశారు, ఇంకా చేయాల్సినవి ఎన్ని అని అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా ఇవిఎంలకు సంబంధించి వివి ప్యాట్‌లు 4850, బియూలు 4440, సియూలు 3950 వచ్చినట్లు రెవిన్యూ సిబ్బంది కలెక్టరుకు వివరించారు. ఇందులో ఇప్పటివరకు 1330 వివి ప్యాట్‌లు, 2048 బియూలు, 3503 సియూ యూనిట్లను స్కానింగ్ చేశారని చెప్పారు. స్కానింగ్ చేసిన వెంటనే ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తగా పని పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం గోడౌన్‌లో ఉన్న వివి ప్యాట్, బియు, సియు యూనిట్లను, వాటి స్కానింగ్ విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. గోడౌన్ భద్రత అంశాలను కూడా అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్ ప్రేమంత కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న మిట్స్ యాజమాన్యం

సాఫ్ట్‌టెక్ కంపెనీతో 'మిట్స్' ఎంఒయు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చెన్నైకు చెందిన ఇన్‌స్పైర్ సాఫ్ట్ టెక్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాల సిఎస్ఇ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదం, ఆ కంపెనీ సిఇఒ, ఫౌండర్ డాక్టర్ కార్తియభాను అవగాహన ఒప్పందంపై సంతకం చేశారని పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పన, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలకు ఈ ఒప్పందం కృషిచేస్తుందన్నారు.

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం బుధవారం, శుక్రవారాలలో నిర్వహించాలని కలెక్టర్ గిరీష ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న శుక్రవారం కె.వి పల్లి మండలంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని అధికారులందరికీ సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లకు కార్యక్రమంపై సూచనలు చేశామన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజంలో మానవ అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షులు బండపల్లి సుభద్ర తెలిపారు. గురువారం మూమెంట్ ఇండియా వారి సూచనల మేరకు గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గుడ్ విల్ కంప్యూటర్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వన్ టౌన్ సిఐ ఎస్.మహబూబ్ బాషా, గుడ్ విల్ కంప్యూటర్ డైరెక్టర్ అజయ్, బండి ఆనంద్,హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తిలు హాజరయ్యారు. మానవ అక్రమ రవాణా గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి యువత తీసుకోవలసిన మొదటి ప్రాధాన్యత గురించి, నైతిక విలువల గురించి, బాల్యవివాహాల గురించి, విద్య యొక్క ప్రాముఖ్యతను గురించి తల్లితండ్రుల గొప్పతనం, ముఖ్యంగా ఆడపిల్లలు వాళ్లను వాళ్ళు రక్షించుకునే విధంగా అవగాహన కలిగిఉండాలని పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా, ప్రేమ, పెళ్లి, సెక్స్, ఉద్యోగం, లేబర్ పేరుతో రకరకాలుగా మనుషులను మానవ అక్రమ రవాణా చేయించడం, వారి నుండి అవయవాలను తీసుకోవడం, వారిని వ్యభిచార గృహాలకు అమ్మడం వారి నుండి క్యాష్ చేసుకోవడం, ఆ సినిమాలలో యాక్టింగు, హీరోలను చేస్తామని పెట్టి వాళ్లను ట్రాఫికింగ్ చేసి వాళ్లతో బెగ్గింగ్ చేయించడం ఈ విధంగా మానవక్రవాలను జరుగుతున్నాయని వివరించారు.

తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అవినీతి కేసులో పక్కా సాక్షాధారాలతో పట్టుబడిన చంద్రబాబు గురించి టిడిపి నాయకులు ఒక మహాత్ముడిని అకారణంగా అరెస్టు చేసినట్లు ప్రజల్ని ఏ మార్చేందుకు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ల సుదీర్ఘకాల విచారణ అనంతరం అనేక ఆధారాలతో చంద్రబాబు నాయుడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారని, ఒక సిఐడి మాత్రమే కాకుండా కేంద్రానికి సంబంధించిన ఈడీ, జీఎస్టీ, ఐటీ వంటి సంస్థల విచారణలోనూ చంద్రబాబు అవినీతి బయటపడడం గమనార్హమన్నారు. టిడిపి నాయకులు ఎంత గగ్గోలు పెట్టినా, గొంతులు చించుకున్నా చంద్రబాబు నాయుడు గురించి ప్రజల మనసుల్లో నాటుకుపోయిన అవినీతి మరకలను తుడచలేరన్నారు. చంద్రబాబు నాయుడుకు కష్టకాలం మొదలైందని, ఇంకా పలు అవినీతి కేసులను ఆయన ఎదుర్కోక తప్పదు అన్నారు. అవినీతికి పాల్పడినప్పుడు ఎంతటి వారైనా చట్టానికి ఒక్కటేనని, చంద్రబాబు నాయుడు దైవంశ సంభూతుడేమీ కాదన్నారు. చంద్రబాబు అవినీతి బాగోతం గురించి చిన్న పిల్లాడి నుంచి ప్రతి ఒక్కరికీ బాగా తెలుసన్నారు. సమావేశంలో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు రవి, మాజీ సర్పంచ్‌లు సురేష్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు రవీంద్రారెడ్డి, ఆనంద్, సుధాకర్, సత్య పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలు త్వరగా పూర్తి చేయాలి

విసిలో పాల్గొన్న కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరతగతన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, రీ-సర్వే, ఎంపిఎఫ్ సి గోడౌన్, హౌసింగ్ తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అధికారులు అందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంలో నిర్లక్ష్యం చూపకుండా భవన నిర్మాణాలు అత్యంత ప్రమాణాలతో రూపుదిద్దు కొనేటట్లు చూడాలన్నారు. అన్ని జిల్లాలలో భవన నిర్మాణాలకు సంబంధించి రోజు రోజుకూ పురోగతి కనిపించేలా ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. జరిగిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడూ బిల్లులు పెండింగ్ లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్వే కార్యక్రమాన్ని పక్కాగా, పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలోని సర్వే సిబ్బంది తహశీల్దార్లతో సమన్వయం చేసుకొని నిర్దేశించిన కాల పరిమితిలోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో వేగం పెంచాలని, గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణంలో స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. బిల్లులను పెండింగ్ లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని సర్వే అధికారులు, సిబ్బంది సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి రీ-సర్వే కార్యక్రమాన్ని త్వరితగతన పూర్తి చేయాలన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి : ఎస్‌పి

మ్యాప్‌లు పరిశీలిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి- కలకడ

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పాత కేసులను తక్షణం పరిష్కరించాలని ఎస్‌పి కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. మండల సరిహద్దుల చిత్రపటాన్ని పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. చిత్రపటాన్ని సరైన రీతిలో రూపొందించాలని క్రైంకు సంబంధించిన వివరాలను పొందుపరచడం సరైన పద్ధతి కాదని సూచించారు. చిత్రపటంలో మండలానికి సరిహద్దులుగా ఉన్న మండలాలను సరైన రీతిలో పొందుపరిచి ఇతరులకు అర్థమయ్యే రీతిలో ఉండేలా ఉంచాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో కరుడుగట్టిన పాత నేరాలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రిపూట గస్తీని ముమ్మడం చేసి చోరీలను నియంత్రించాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకోవాలని డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని హెల్మెట్లు ధరించాలని గుర్తు చేశారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలైనా నాటుసారా తయారీ, అమ్మకాలు, చేయడం నేరమని, వాటిపై దృష్టి సారిం చాలని పేర్కొన్నారు. చోరీలు, జూదం, కోడిపందాలు వగైరా యిలు జరగకుండా గట్టి నిగా ఉంచి శాంతి భద్ర తలకు విఘాతం కలిగించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెలలో వినాయక చవితి ఉత్సవా లను నిర్వహిం చుకునేందుకు ఏర్పాటు చేయు విగ్రహా లకు తప్పనిసరిగా సంబంధిత పోలీసుస్టేషన్ నుండి అనుమతులు పొందాలని పేర్కొన్నారు. విగ్రహాలు ఏర్పాటుకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల కమిటీలు వేసి ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యుల బాధ్యత వహించేలా వారికి సూచనలు సలహాలు అందుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాషా, సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, హెడ్‌కానిస్టేబుళ్లు తోట హరిబాబు, రమేష్ కుమార్, పోలీసు సిబ్బంది మునిరాజా, కరుణాకర, మహబూబ్ అలీ, డ్రైవర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా అటవీ అధికారి వివేక్

మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి వివేక్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అడవిలోకి కూంబింగ్ వెళ్ళినప్పుడు అటవీ శాఖ సిబ్బందిపై దాడులు జరిగిన ఘటనలు చూసి ఉంటామని, కలెక్టర్ కార్యాలయంలో తనపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ అధికారి వివేక్ అన్నారు. గురువారం రాజంపేటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షికారుపాలెంకు చెందిన విశ్వనాధ్ నాయక్, శంకర్ నాయక్ అనే ఇరువురు వ్యక్తులు తనపై దాడి చేశారని తెలిపారు. షికారుపాలెంకు చెందిన గిరిజనులకు అటవీ భూమి నుంచి సాగు కొరకు వ్యక్తికి ఐదు ఎకరాల చొప్పున సుమారు 85 మందికి భూమిని కేటాయించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని పేర్కొన్నారు. ఆ ప్రతిపాదన 1997 సంవత్సరంలోనే తిరస్కరించామన్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇరువురు భూములు ఇప్పిస్తామంటూ అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి తాను వెళుతున్న సమయంలో కలెక్టర్ కార్యాలయంలోని తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒక జిల్లా స్థాయి అధికారికి కలెక్టర్ కార్యాలయంలోనే రక్షణ లేనప్పుడు అటవీ ప్రాంతాన్ని సంరక్షించేందుకు అనునిత్యం అడవులలో సంచరించే సామాన్య అటవీ సిబ్బంది పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుని దాడికి పాల్పడ్డ వారిని శిక్షించి అటవీశాఖ సిబ్బందికి మనో ధైర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని డివిజన్ల రేంజర్లు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన అటవీ క్షేత్రాధికారుల సంఘం

జిల్లా అటవీ అధికారిపై దాడిని అటవీ క్షేత్రాధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. బాధ్యులపై చర్యలు చేపట్టే వరకూ విడతల వారీగా ఆందోళనలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రామ్లా నాయక్, కార్యదర్శి లక్ష్మీపతి, కోశాధికారి నారాయణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు వేస్తున్న అల్లాబకష్

రెండు పార్టీలతో ప్రజలు విసుగు చెందారు

ప్రజాశక్తి-రాయచోటి

వైసిపి, టిడిపిలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ కోడూరు నియోజకవర్గ కన్వీనర్ ఎస్.అల్లా బకస్ సిఎల్‌పి అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లకిరెడ్డిపల్లి, రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి మండలాలలో దాదాపు 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి, టిడిపిపై కేసులు నాయకులను భ్రష్టు పట్టిస్తున్నారని తెలిపారు. ఎన్నేళ్లు పాలించినా కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, జిల్లా మీడియా చైర్మన్ నరేష్, రామాపురం మండల అధ్యక్షుడు మైసూర్ రెడ్డి, ఎస్ నూరుల్లా, పి.హబీబ్ ,పి.రఘురామ, ఆర్.నాగరాజు, ఎస్.అహ్మద్, పి వెంకటేష్, ఎం.రమణయ్య, రమణ, మహమ్మద్‌బాషా, కుమార్, రాజాబాబు, నౌషాద్, సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మనోహర్, సుందర్‌రాజు, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ : డిఇఒ

రాయచోటి: పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ నెల 21న 'చిరుధాన్యాలు ఒక మంచి పోషకాహారం లేదా ఒక మంచి ఆహారం' అనే అంశంపై జిల్లా స్థాయి సైన్సు సెమినార్ జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్యపు పాఠశాలలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సెమినార్‌లో పాల్గొనడానికి అర్హులు అని అన్నారు. ఒక పాఠశాల నుంచి ఒకరు మాత్రమే పాల్గొనాలన్నారు. ప్రదర్శనలో శాస్త్రీయ విషయాలు, ప్రసంగంలో పటిమ, ప్రశ్నలకు సమాధానమివ్వగల సామర్థ్యం, విజువల్స్ వాడకంలో కొత్తదనం మొదలైన అంశాలను పరీక్షిస్తారన్నారు. సెమినార్ ప్రారంభమయ్యే ముందు పాల్గొనే వారందరికీ రాతపూర్వక ఆప్టిట్యూడ్ టెస్ట్ కూడా ఉంటుందని తెలిపారు. ప్రదర్శన సమయంలో 3డి మోడల్స్, వీడియోలు, ఫిల్మ్‌లను ప్రదర్శించడానికి అనుమతించరని తెలిపారు.

పవన్‌కు రాజకీయాలపై స్పష్టత లేదు

రాజంపేట అర్బన్: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాజకీయాలపై స్పష్టత లేదని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో టిడిపితో కలిసి పోటీ చేస్తామని పవన్ చేసిన వ్యాఖ్యలు అసంపూర్ణంగా ఉన్నాయని తెలిపారు. ఎన్‌డిఎలో కొనసాగుతూ టిడిపితో కలిసి పోటీ చేయడం ఏంటని ప్రశ్నించారు. అసలు పవన్ ఇండియాలో ఉన్నారా, లేరా అని రాష్ట్ర ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు. మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటన పట్ల గాని, రాహుల్ గాంధీ పట్ల బిజెపి వ్యవహరించిన కక్ష పూరితమైన చర్యల పట్ల గాని టిడిపి, జనసేన స్పందించలేదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టిపల్లి సన్నీ పాల్గొన్నారు.

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు

సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టించి ఇంజనీర్లందరికీ ఆదర్శ ప్రాయుడిగా నిలిచిన "సర్ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య" గారి జయంతి శుభసందర్భంగా అధికారులకు, ఇంజినీర్లందరికీ " ఇంజినీర్స్ డే" శుభాకాంక్షలు

టి.శివరామ్, డి.ఇ.ఇ., (ఆర్&బి)
ఎన్.హెచ్.సబ్ డివిజన్, మదనపల్లి.

పి.మధుసూదన, ఎ.ఇ.ఇ,

వై.ధర్మారెడ్డి, ఎ.ఇ.,
(ఆర్&బి) ఎన్.హెచ్. సెక్షన్, మదనపల్లి.

జాతీయ సమైక్యతకు ప్రతీక 'హిందీ'

ప్రజాశక్తి-రాయచోటి

విభిన్న భాషల సమహారంగా ఉన్న భారతదేశంలో జాతీయ సమైక్యతకు ప్రతీకగా హిందీ కొనసాగుతున్నదని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మొదట ప్రేమ్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి హిందీ సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన జాతీయ భాషగా పేరుగాంచిన హిందీ భాషకు సెప్టెంబర్ 14న ఒక ప్రత్యేకత ఉందన్నారు. 1949వ సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అప్పటి నుండి ఈ తేదీని హిందీ దివస్‌గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించబ డిందని తెలిపారు. మన జాతిపిత మహాత్మా గాంధీ కూడా దేశంలో ఐక్యతను తీసుకురావడానికి ఈ భాషనే ఎక్కువగా వాడేవారని అందుకే ఈ భాషను లాంగ్వేజ్ ఆఫ్ యూనిటి గా పిరుస్తున్నారన్నారు. హిందీని దేశంలోనే కాక, మారిషస్, న్యూజిలాండ్, అమెరికా, ట్రినినాడ్ వంటి దేశాలలో కూడా ఎక్కువగా మాట్లాడుతు న్నారన్నారు. ప్రపంచంలో 150 కంటే ఎక్కువ యూనివర్సిటీలు హిందీకి సంబంధించిన కోర్సులను నిర్వహిస్తున్నాయన్నారు. భారత మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి హిందీ భాషలో ఐక్యరాజ్యసమితిలో మాట్లాడి హిందీభాషా మాధుర్యాలను ప్రపంచానికి తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం హిందీ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ,డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయులు సుజాతబాయి, మహబూబ్ భాష బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి లత ఆధ్వర్యంలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. కార్యక్రమంలో హిందీ భాష ఉపాధ్యాయులు షఫీవుల్లా, సుదర్శన్ రాజు, శంకర్ రెడ్డి, వీరారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, కిరణ్ కుమార్, శారద, అమర్నాథ్, పవన్, కుమారి, శైలజ, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు దోహదపడిన భాష హిందీ భాష అని కొత్త బోయినపల్లి ప్రదానోపాధ్యాయురాలు కె.భారతి అన్నారు. మండల పరిధిలోని కొత్త బోయినపల్లి ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీబాషా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులు కె.భారతి, గుంటూరు రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులు శేషంరాజు, హిందీ ఉపాధ్యాయులు యస్.వి రామరాజు, యస్.అమరావతి

రాయచోటి : ప్రేమ్‌చంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ని శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. **బి.కొత్తకోట :** అన్నమయ్య జిల్లా,బి.కొత్తకోట పట్టణం,ఎ.పి.ఆదర్శ పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హిందీ భాషపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మండల విద్యాశాఖ అధికారి రెడ్డిశేఖర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శీనునాయక్, ఉపాధ్యాయులు జహీర్‌ఖాన్, నాగసాయిలీల, నూర్ మహమ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ భాష దినోత్సవం ఆ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబితా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాల నరసింహులు, షామీర్ హుస్సేన్, ఆసిఫ్ భాష, శేషాద్రి, హేమలత, రమణయ్య, ప్రమీల కుమారి పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గాలివీడులో జాతీయ హిందీ భాషా దినోత్సవం ఇన్‌ఛార్జి ప్రదనో ఉపాధ్యాయులు కె.శివారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో శివారెడ్డి మాట్లాడుతూ హిందీ భాష లిపి గురించి పిల్లలకు వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక జడ్‌పిఉన్నత పాఠశాలలో హిందీభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష ఔన్నత్యం గురించి వివరించారు. హిందీ ప్రపంచంలోనే అత్యధికం గా మాట్లాడే మూడవ అతి పెద్ద భాష అన్నారు. హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ హిందీ భాష మాధుర్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి వసుదా రూటా రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఖాన్ సుధాకర్ నాయుడు ఆర్.వి.రమణ నాగరాజ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం ప్రధానం

- మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాధిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ రాధిక అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ రాదిక ప్రజాశక్తితో మాట్లాడుతూ మన మందరం శారీరక ఆరోగ్యం గురించి ఆలోచిస్తామని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమై నదన్నారు. ఎందు కంటే మానసికంగా దృఢంగా ఉంటేనే మన పనులు గానీ పురోగతి గాని బాగుంటుందని, దాని మీదే మన పని తీరు కూడా ఉంటుందన్నారు. అంతే కాకుండా మనుషులు సంతోషంగా అందరితో పాటు కలిసి మెలసి జీవించడానికి ఈ మానసిక ఆరోగ్యం దోహదపడుతుందని తెలిపారు. మనిషి మానసిక ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు విపరీతమైన కోపం, ద్వేషం, కుంగుబాటుతో బాధపడుతుంటారని చెప్పారు. ఇలాంటి లక్షలణాలు ఉన్న వారు మామూలుగా సమాజంలో జీవించలేరని, వాళ్ళు విపరీతంగా ప్రవర్తిస్తారన్నారు. అంతే కాకుండా మానసిక కుంగుబాటు ఉన్నవాళ్ళు ఏపని సరిగ్గా చేయలేకపోవడం ఒంటరిగా ఉండడం, ఎవరితో కలవలేక పోవడం, దేని మీద శ్రద్ధ చూపించలేకపోవడం వల్ల వారి పనితీరు దెబ్బతింటుందని చెప్పారు. అంతే కాకుండా వాళ్ళు సమాజానికి పెద్దగా ఏమీ చేయలేక పోతారని తెలిపారు. మానసిక ఆరోగ్యం అనేక చాలా ప్రాముఖ్యత ఉందని, శారీక ఆర్యోగంతో సమానంగా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాబట్టి ఇందులో చాలా మందికి మానసిక ఆరోగ్యం అంటే అవగాహన లేదని, ఇందులో ముఖ్యంగా మానసిక వాద్యుల్లో రెండు రకాలు న్యూరోటిక్, సైకోటిక్. న్యూరోటిక్ అనేది మనిషికి మానసిక లక్ష్యణాలు తెలుస్తుంది. రోగే చెప్పగలుగుతాడు. సైకోటిక్ అనేది అతనికి లక్ష్యణాలు ఉన్నట్లు అతనికే తెలియదు. వీరు సంబంధం లేకుండా మాట్లాడడం, అసందర్భంగా మాట్లాడడం, వాళ్ళను వీళ్ళను అనుమానించడం, వాళ్ళల్లో వాళ్ళు మాట్లా డుకుం టుంటారని, వీరు శుభ్రత కూడా పాటించకపోవడం, మనుషులను నమ్మ పోవడం, లేనిది ఉన్నట్లు ఊహించు కోవడం ఇలా అనుమానాలు చెందుతుంటారని, ఇలాంటి వన్నీ సైకోటిక్ లక్షణాలన్నారు. కొంత మంది మ్యానియా వైపులర్ డిజార్డర్‌తో విపరీతంగా ప్రవర్తిస్తారని, ఎక్కువ ఆనందంగా ఉంటారన్నారు. ఏపనైనా నేను చేయగ లననే ధీమా వ్యక్తం చేస్తుంటారు. గొప్ప మాటలు చెబుతుంటారు. డబ్బులు విపరీతంగా ఖర్చు చేస్తుంటారని అన్నారు. నీళ్ల ఎక్కువగా తీసుకోవడం, అన్నీ విపరీంగా చేస్తుంటారని దీనిని మ్యానియా లక్షణాలు అంటారు. ఇందులో బైపులార్ రెండు రకాలు మ్యానియా, డిప్రషన్‌లో ఎవ్వరితోనూ మాట్లాడకపోవడం, లేజీగా ఉండడం, పనులు సరిగ్గా చేసుకోకపోవడం ఇలాంటివి డిప్రెషన్ లక్షణాలు. దీర్ఘకాలిక వ్యాధిగా ఉండేది సిరోఫిమియా ఇందులో చాలా మందికి కొద్ది లక్షణాలు ఉంటాయని చెప్పారు. కొద్ది మందికి విపరీతమైన లక్షణాలు ఉంటాయి. వీరిలో అనుమానం, భయం, ఎవ్వరినీ నమ్మక పోవడం వంటివి ఉంటాయన్నారు. మానసిక వ్యాధివల్ల కుటుంబం మొత్తం ఇబ్బంది పడాల్సిన వస్తుందని. రోగికి చికిత్సలు అందిస్తే మామూల స్థితికి వచ్చి మామూలు జీవితం గడుపురన్నారు. మనం దీని గురించి ఖచ్చి తంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఎవరికైనా కనిపించినట్లయితే మానసిక వ్యాధి నిపుణులను సప్రదించాలని సూచిం చారు. ప్రతి ఒక్కరూ మానిసక వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక హార్టికల్చర్ నర్సరీ ఆవరణలో గురువారం ఉద్యాన పంటల పైన జిల్లాస్థాయి అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలు వలన రైతులకు కలిగే లాభాలతో పాటు వివిధ రకాల ప్రభుత్వ స్కీములను వివరించారు. ముఖ్యంగా మామిడి పంట చేతికి వచ్చేలోపే గాలుల వల్ల పంట మధ్యలోనే నష్టపోతే వాటిని మామిడిఒరుగు రూపంలో చేసిన వాటిని కిలోల చొప్పున ఆర్టికల్చర్ వారు తీసుకోవడం జరుగుతుందన్నారు. కరివేపాకు, పసుపు పంటలను ఈ రూపంలో నిల్వ చేసుకొని అమ్ముకోవచ్చని తద్వారా రైతు నష్టాల భారీ పడకు ండా ఉండొచ్చు అన్నారు. వీటికి సంబంధించిన పనిముట్లకు రెండున్నర లక్ష వరకు సబ్సిడీ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం నిమ్మ, చీని పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తరచుగా నిమ్మ, చీని, బొప్పాయిలో వచ్చే వివిధ రకాల చీడపీడల గురించి వాటికి తీసుకో వలసిన మెలకువలను

సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్రబాబు

రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఆసియా కోరమాండల్ జోనల్ మేనేజర్ మాధవన్, లక్ష్మీ శ్రీనివాస పరస్పర సంఘం ప్రెసిడెంట్ రామకృష్ణంరాజు, కో ప్రెసిడెంట్ లక్ష్మీకర రెడ్డి, సిఇఒ రాజగోపాల్‌రెడ్డి, బోర్డు మెంబర్స్ రైతులు పాల్గొన్నారు.

మొదటి విడతలో 94 శాతం సీట్లు భర్తీ

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫస్ట్ పేస్ కౌన్సిలింగ్ లో 94 శాతం బిటెక్ సీట్లు భర్తీకావడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గౌరవ కార్యదర్శి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలపైన, విద్యార్థులు, వారితల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు దచీశీఅవఁకుంటామని తెలిపారు. తమ కళాశాలను ఎన్నుకున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతోపాటు అధునాతన తరగతి గదులు, లేబరేటరీలు, ఆహ్లాదకరమైన వాతావరణం, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన వరల్డ్ క్లాస్ క్వాలిటీ విద్యను అందించడం జరుగుతోందన్నారు. విద్యార్థులందరూ ఇష్టపడి చదివి ఇటు కళాశాలకు, అటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలం వత్తలూరు గ్రామపంచాయతీ ఈడిగపల్లి గ్రామానికి చెందిన బోధనపు సుబ్రహ్మణ్యం, అమ్ములు పెళ్లిరోజు సందర్భంగా పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు నిత్యవసర సరుకులు వాలంటీర్ మురళీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ వాలంటీర్ మాట్లాడుతూ మన కుటుం బంలో జరిగే శుభ కార్యక్రమాలలో అనవసర ఖర్చులు చేయకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. ప్రతి ఒక్కరు ఇలా సేవా కార్యక్ర మాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మెన్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని కృషి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ హితవు పలికారు. బుధవారం జుంజూరుపేంటలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కృషి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి, టిబి, ఇతర సుఖ వ్యాధులపై వైద్య శిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ చంద్రమోహన్ మాట్లాడుతూ సుఖ వ్యాధు లు ఎలా సంక్రమిస్తాయి, వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణ మార్గాల గురించి కూలంకషంగా వివరించారు. అనంతరం కేన్సర్, స్క్రీనింగ్ పైన అవగాహన కల్పించారు. హెచ్‌ఐవిపరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో కృషి సంస్థ జగదీష్, ఒఆర్‌డబ్ల్యు కళావతి, సావిత్రి, ఎం ఎల్‌సిలు కీర్తి, కవిత, ఆశ కార్య కర్త వెంకట్రమణమ్మ, పిఇలు సునీత, శ్రీదేవి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-రాయచోటి

అందరం పర్యావరణ పరిరక్షణ కోసం అందరం పటుపడదామని, కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేద్దామని కలెక్టర్ గిరిష , జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం డాక్టర్ అబ్దుల్‌కలాం యువకెరటం ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టిద్దాం-పర్యావరనాన్ని కాపాడుదాం' పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న గణపతి పండుగను పురస్కరించుకొని ప్రజలందరూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను నివారించి పర్యావరణాన్ని పరిరక్షించే మట్టి గణపతి విగ్రహాలను అందరూ ప్రతిష్టించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడటం వల్ల పర్యావరణం కలుషితమై ప్రజలకు హానికరం కల్గుతుందని తెలిపారు. అందరం కలిసి కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేద్దాం అన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ గణపతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ప్రస్తుతం పర్యావరణం అనేక రకాలుగా కాలుష్యం అవుతూ రోజుకు రోజుకు జీవనాధారానికి ప్రమాదకరస్థాయికి చేరుతోందని చెప్పారు. ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటా మన్నారు. అందరం మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను వాడకుండా పర్యావరణం కలుష్యం, కలుషితం కాకుండా బాధ్య తగా ఉందామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నవీన్, షాజహాన్, సురేష్ , రాము పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్ గౌరీదేవి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గర్భిణులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.గౌరీదేవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గట్టు పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలోని పోషణ మాసోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినరల్స్, మిల్లెట్స్ కాల్షియం, ఐరన్ కలిగిన ఆకుకూరలు, కాయగూరలుపండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాలను గర్భిణులు, బాలింతలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకిట్లు గర్భిణులు, బాలింతలకు అందచేయాలన్నారు. వైఎస్ఆర్ కిట్లను ఉపయో గించిన రక్తహీ నత, నిర్మూలన, బాలింతలకు తల్లిపాలు అధికంగా ఉత్పత్తి అవ్వు తాయన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిఎంఎస్‌కె బి.శ్రీవాణి, ఎఎన్ఎం స్వరూపారాణి, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.మంగళ, ఎల్.శ్యామల, ఎం.సుజాత, టి.శ్యామల గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రణాళి కతో చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ప్రతి వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటిని ఆరోగ్య కార్యకర్త, సిహెచ్ఒ సర్వే చేసి, ఆ కుటుంబానికి అవసరమైన వైద్యాన్ని అందించమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముందుగా క్లస్టర్స్ వారీగా వాలంటీర్లు ఆయా కుటుంబాలకు ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తారని, అనంతరం ఎఎన్ఎం, సిహెచ్ఒ ఆ కుటుంబాలను సందర్శించి, వారి పూర్తి వివరాలను ఆరోగ్యశ్రీ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ శంకర్, డిటి అన్సర్, నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు. **కలకడ :** ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపిపి శ్రీదేవి రవికుమార్ అధ్యక్షతన అవగాహన కల్పించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ అధికారులతో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ప్రజల అవసరాలను బట్టి పరీక్షలు నిర్వహించాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-రామసముద్రం

రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ చంద్రశేఖర్ గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఉత్సవాలకు ప్రభుత్వం నిర్దేశించిన నియమ, నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. నిమజ్జనం రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు తావు లేకుండా సామరస్యంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీల్ చైర్ బహూకరణ

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలం లోనిగర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సౌకర్యం కోసం స్థానిక కుమ్మరిపల్లె గ్రామానికి చెందిన రావూరి రెడ్డన్న జ్ఞాపకార్థం ఆయన మనువడు సందీప్ వీల్ చైర్‌ను బహూకరించినట్లు వైద్యాధికారి శ్యామల పేర్కొన్నారు. రోగులకు ఉపయోగపడే వీల్‌చైర్‌ను అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, స్థానికులు మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో శ్రీధర్‌రెడ్డి మృతి

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

శ్రీధర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

తాను సంపాదించిన దాంట్లో పది మందికి పంచాలని పరితపించి గత ఐదేళ్లగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి మంచిపేరు తెచ్చుకున్న వైసిపి యువజన నాయకుడు, కాంట్రాక్టర్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీధర్‌రెడ్డి మరణంతో మండలంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. అనారోగ్యంతో గత మూడు నెలలుగాహైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన సాలాబాదుకు రాత్రికి తరలిం చారు. శుక్రవారం స్వగ్రామంలో అంత్య క్రియలు నిర్వహించనున్నారు. శ్రీధర్‌రెడ్డి మరణంతో పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీధర్‌రెడ్డి మాత్రం తనవైన శైలిలో గత ఐదేళ్ల కాలంగా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో, పట్టణాల్లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ పలువురి చేత మన్ననలు పొందుతూ ముందుకు సాగారని గ్రామస్తులు తెలిపారు. గత పంచాయతీ ఎన్నికల్లో నెలకొన్న రసవత్తరమైన పోటీలో హేమాహేమీలను సైతం ఓడించి తన వర్గంకు చెందిన దళిత మహిళను సర్పంచ్‌గా గెలిపించారన్నారు. సాలాబాద్, మ లాబిపల్లెలలో సిమెంట్ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించారన్నారు. తాను విద్యనభ్యసించిన రాచపల్లి హైస్కూల్‌కు డెస్కులు, విద్యార్థులకు బహుమతులు అందజేశారని చెప్పారు. తనను ఆశ్రయిస్తే వారికి అండగా నిలబడి ఎప్పుడూ ముందుకు సాగారన్నారు. అనేక సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి పేదల ఆకలి తీర్చారని చెప్పారు. ఒంటిమిట్ట మండలంలో చాలా మందికి ఆపద్బాంధవుడుగా పేరొందిన ముద్ర వేసుకున్న శ్రీధర్ రెడ్డి మరణం మండలానికి తీరని లోటు ఆవేదన వ్యక్తం చేశారు.

148 నూతన పింఛన్లు పంపిణీ

వీరబల్లి : మండల కేంద్రమైన వీరబల్లి సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 148 పెన్షన్లను ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు వీరనాగిరెడ్డి చేతుల మీదుగా గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 148 నూతన పింఛన్లు మంజూరయ్యాయని. వీరబల్లి పంచాయతీకి 32 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి నెల మండలానికి రూ. 1.50కోట్లు పెన్షన్ దారులకు వెల్ఫేర్ అం దిస్తూ, వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో మండల నాయ కులు వీరనాగిరెడ్డి, ఇఓపిఆర్‌డి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గం

రైల్వేకోడూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అరెస్టు, రిమాండ్ దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రెండవ రోజు పార్టీ కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో కూర్చున్న వారిలో మాజీ సర్పంచ్ నాగరాజు, కట్ల గుండయ్య, కొమ్మ శివ, వెంకటేష్‌లకు చౌదరి, చిన్న, మనోజ్ పాల్గొన్నారు. **చిట్వేలి :** మండల పరిధిలోని స్థానిక ఎన్‌టిఆర్ కూడలిలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసనగా కాశెట్టి సుబ్బరాయుడు అధ్యక్షతన రిలే నిరాహార దీక్షలు స్థానికులు చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంతాని ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటి రంగానికి దిక్సూచిగా పేరు ప్రఖ్యాతులుగాంచిన చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలు రామాంజనేయులు నాయుడు, నాగార్జున, సత్యనారాయణ, బాలు రెడ్డయ్య నాయుడు, గుంటి శేషయ్య పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న ఎల్లటూరు శ్రీనివాసరాజు

ఉత్సవ కమిటీకి విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పండుగలు సంస్కృతికి నిలయాలు డిఆర్‌డిఎ మాజీ అధికారి ఎల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. వినాయక పండుగను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని సరస్వతీపురం, మంగళమిట్ట, బలిజపల్లె దళితవాడకు చెందిన యువత ఎల్లటూరు భవన్‌లో శ్రీనివాసరాజును కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ వారికి ఆయన విరాళాలు అందజేసి మాట్లాడుతూ గణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లటూరు శివరామరాజు, నరేంద్ర, గణపతి ఉత్సవ కమిటీలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక శుభ్రం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలో బెంగళూరు రోడ్డులోని హిందూ శ్మశాన వాటికను గుంతూరు కిట్టన్న జ్ఞాపకర్థం అతని కుమారులు వెంకట్రమణ, రామాంజిలు, లక్ష్మీనారాయణలు సొంత నిధులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఏదో ఒక సేవాకార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది బెంగళూరు రోడ్డులోని హిందూ స్మశాన వాటికలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి, చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా మారడంతో రూ.20 వేలు వెచ్చించి శుభ్రం చేయించామన్నారు.

కలకడ : ఉలవలను పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ ఉలవలను సద్వినియం చేసుకోవాలని ఎంపిపి శ్రీదేవకుమార్ రైతులను కోరారు. గురువారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ ఆర్‌బికెలో సబ్సిడీ కింద ఉలవలు పది కేజీల ప్యాకెట్‌ను రూ.225కే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రైతులందరూ ఉలవలు సాగుచేసుకొని మంచి దిగుబడి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి లావణ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణమ్మ, వైసిపి నాయకులు ఉదయభాస్కర్,ెండ్డప్ప, బయన్న, చిన్నపనాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రభుత్వం అందించే రాయితీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి యధుభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గాలివీడు-3 రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్-2023 ప్రత్యామ్నాయ పంట కింద 80 శాతం సబ్సిడీతో ఉలవలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీ ఉలవలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు 20 శాతం మాత్రమే చెల్లించే ఉలవలను పొందవచ్చున్నారు. రిజిస్ట్రేషన్ రైతులందరికి సబ్సీడి ఉలవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్, వ్యవసాయ అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణారెడ్డి, వార్డు మెంబర్ ఆదినారాయణరెడ్డి సుబ్బారెడ్డి, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోచోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వేపూరికోట పంచాయతీ, రాజుగారిపల్లికి చెందిన అరవింద్ భార్య విజయలక్ష్మి (31), బైక్‌లో అంగన్వాడీపాఠశాలకువెళుతుండగా మార్గమధ్యంలోనే బత్తలాపురం క్రాస్ వద్ద బైక్‌కు ఆటో అడ్డు రావడంతో అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపండి దన్నారు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో బంధు వులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అత్యవసర విభాగం వైద్యులు వైద్యం అందించి నప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకు వెళ్లాలని వైద్యులుసూచించడంతో వారు రుయాకు వెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి రెండు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు బాలుపల్లి రేంజ్ ఎఫ్‌ఆర్‌ఒ టి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దేశెట్టిపల్లె బీట్ పరిధిలో దాడులు చేశామన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకు నేందుకు ప్రయత్నించగా ముగ్గురు పరారయ్యారని గతంలో అటవీ శాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేసిన కే.సుబ్బరాయుడును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రెండు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో డిఆర్‌ఒఎస్ చంద్రకళ, ఎఫ్‌ఎస్‌ఒ ఎం.బాలచంద్రుడు, ఎఫ్‌బిఒలు ఎం.సుధాకర్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో ఉన్న మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని మదనపల్లి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలు..మండలంలోని సిటిఎం గొల్లపల్లిమిట్టలో నివాసమున్న గంగులప్ప అలియాస్ అప్పల్ల పోరిగింటికి చెందిన మహిళ(32) మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలు అనారోగ్యంతో బాధప డుతూ ఇంటి దగ్గరే ఉండేదన్నారు. తన భర్త ఈ నెల 9న భవన నిర్మాణ పనులకు వెళ్లాడన్నారు. ఒంటరిగా ఉన్న మహిళలపై గంగులప్ప అత్యాచారానికి పాల్ప డ్డాడని చెప్పారు. ఆమె కూతురు గమనించి ఇంట్లో చెప్పడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. బాధితురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వృద్ధుడిపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తన కూతుర్ని వెతుక్కుంటూ దారితప్పి వచ్చిన వృద్ధుడిపై పైశాచిక దాడికిపాల్పడ్డ సంఘటన మదనపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పుంగనూరు మండలం ఏతురుకు చెందిన ఆదినారా యణ తన కూతురు రాజమ్మ కోళ్లబైలు కాలనీలో కాపురం ఉండటంతో చూడటా నికి రాత్రి వచ్చాడని తెలిపారు. దారితెలియక రోడ్డుపై నిలబడి ఉండగా స్థాని కంగా ఉన్న ఇద్దరు ఇక్కడ ఏంపని అంటూ కర్రలతో తీవ్రంగా చితకబాదారని అన్నారు. వారి దాడిలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు గుర్తించి మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు అతనికి మెరుగైన వైద్యం అందించి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే తిరుపతి రుయాకు రెఫర్ చేశారన్నారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.